క్లుప్తంగా

వేంకటేశ్వరునికి స్వర్ణమయ కవచాలంకృత సేవ



పూర్ణాహుతి పూజల్లో ఆలయ నిర్వాహకులు

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో కొలువైన వేంకటేశ్వరస్వామి ఆలయ షష్టమ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం ముగిశాయి. స్వామికి సంకష్టహర చతుర్థి సందర్భంగా వేదపండితులు, ఆలయ ప్రధానార్చకుడు శ్రీనివాసాచార్యులు స్వామిని స్వర్ణమయ కవచాలంకృత విశేషాలంకరణసేవ నిర్వహించారు. నిత్యోపాసన, మహాపూర్ణాహుతి, చక్రస్నానం, బలిహరణ వంటి విశేష పూజలు జరిపారు. ఆలయ నిర్వహకులు గణేశుల వెంకటేశ్వరరావు దంపతుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం వేడుకగా జరిపారు. టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో కోలాటం నిర్వహించారు. భారీ ఎత్తున్న అన్నసమారాధన నిర్వహించారు. అనంతరం వేదపండితులను ఘనంగా సత్కరించారు.

నేడు రైతు బజారు ప్రారంభం

ఆలమూరు: గ్రామంలో సుమారు రూ.50 లక్షలతో నిర్మించిన రైతు బజారును ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి సోమవారం ప్రారంభిస్తారని పార్టీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు తెలిపారు. ఆయన మాట్లాడుతూ స్థానిక వ్యవసాయ మార్కెట్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ఈ రైతుబజారు వల్ల పరిసర ప్రాంత ప్రజలకు నాణ్యమైన కూరగాయలు సరసమైన ధరలకే లభ్యమవుతాయన్నారు. అలాగే పెనికేరులో ఉదయం ఏడు గంటల నుంచి రెండో విడత గడప గడపకూ కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు ఈ కార్యక్రమానికి హాజరు కావాలని ఆయన సూచించారు.

గణేశుని తత్వం మహిమాన్వితం

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వర స్వామిని నైమిశారణ్య పీఠాధిపతులు, హిందూ ధార్మిక సేవా సంస్థ వ్యవస్థాపకులు శ్రీ బాల బ్రహ్మానంద సరస్వతి ఆదివారం దర్శించారు. ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బాలబ్రహ్మానందసరస్వతి గణేశుని తత్వం మహిమాన్వితమైనదని ప్రవచించారు. పురాణ విజ్ఞానం నేటి తరానికి అవసరమని వివరించారు.

నూకాంబిక దర్శనానికి పోటెత్తిన భక్తులు

ఆలమూరు: మండలంలోని చింతలూరులో వేంచేసిన నూకాంబిక అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. అమ్మవారి తీర్థోత్సవాల్లో మూడు వారాలు పూర్తవుతున్నా భక్తుల తాకిడి తగ్గడం లేదు. ఆదివారం సెలవు కావడంతో సుదూర, పరిసరాల ప్రాంతాల నుంచి విచ్చేసిన వేలాది మంది భక్తులతో క్యూలన్నీ కిక్కిరిసి పోయాయి. భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించి మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు పసుపు, కుంకుమ, నూతన వస్త్రాలను అందజేశారు. ఆలమూరు ఎస్సై ఎస్.శివప్రసాద్ నేతృత్వంలో పోలీసులు బందోబస్తు కొనసాగిస్తున్నారు. చైర్మన్ నూకపెయ్యి సూరిబాబు, ఈఓ ఉండవల్లి వీర్రాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వైభవంగా అమ్మవారి జాతర

మామిడికుదురు: లూటుకుర్రులోని బాడిలంకలో వేంచేసిన గ్రామదేవత శ్రీపాళ్లమ్మ జాతర ఆదివారం వైభవంగా జరిగింది. గరగ నృత్యాలు, చిత్ర, విచిత్ర వేషధారణలు, డప్పు వాయిద్యాలు, బాణసంచా కాల్పుల నడుమ కనుల పండువగా జరిపించారు. జాతర మహోత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన వివిధ సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. జాతర పురస్కరించుకుని అమ్మవారి ఆలయాన్ని పలు రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. అమ్మవారి జాతర 12వ తేదీ వరకు జరుగుతాయని ఉత్సవ కమిటీ పేర్కొంది.

స్వామి వార్ల సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి



అయినవిల్లి విఘ్నేశ్వరుని చిత్రపటాన్ని హైకోర్టు జడ్జి చక్రవర్తికి అందజేస్తున్న ఆలయ చైర్మన్

అయినవిల్లి/ఆత్రేయపురం: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి, వాడపల్లి వేంకటేశ్వరస్వామి వార్లను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి బీవీఎల్ఎన్ చక్రవర్తి కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ఆయనను తొలుత ఆలయ ప్రధానార్చకులు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి, ఆలయ చైర్మన్ నంబూరి వెంకటరమణరాజు, వాడపల్లిలో చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో ముదునూరి సత్యనారాయణ రాజు, అర్చకులు పూర్ణకుంభంతో ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేసిన చక్రవర్తి దంపతులను వేదపండితులు వేద మంత్రాలతో సత్కరించారు. స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. స్వామివారి చరిత్ర వివరించారు. ఆయన వెంట కొత్తపేట ఆర్డీఓ ముక్కంటి, పోలీసు సిబ్బంది ఉన్నారు.

వృద్ధులకు కంటి వెలుగు

- వృద్ధాప్యంలో జీవన గమనానికి భరోసా
- మూడు నియోజకవర్గాల్లో 38,678 మందికి కంటి పరీక్షలు
- మూడో విడత చురుగ్గా జరుగుతున్న పరీక్షలు



జొన్నాడలో వైఎస్సార్ కంటి వెలుగు పరీక్షలు నిర్వహిస్తున్న నేత్ర వైద్య నిపుణురాలు శ్రీలక్ష్మి

ఆలమూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వృద్ధులకు మెరుగైన కంటిచూపు కోసం ప్రవేశపెట్టిన వైఎస్సార్ కంటి వెలుగు వృద్ధుల్లో అంధత్వ నివారణకు దోహదపడుతుంది. చిన్నారులు, విద్యార్థులకు భవిష్యత్‌లో కంటి సంబంధిత సమస్యలు రాకుండా చర్యలు తీసుకుంటుంది. ఇప్పటికే వైఎస్సార్ సీపీ కంటి వెలుగు రెండు విడతలు పూర్తి కాగా మూడో విడత కంటి పరీక్షలు ముమ్మరంగా జరుగుతున్నాయి. కొత్తపేట, రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల్లో డివిజన్‌లో ఇప్పటి వరకు 38,678 మందికి కంటి పరీక్షలు చేయగా, 17,439 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. కంటిచూపు మందగింపుతో బాధపడుతున్న సుమారు 750 మందికి శస్త్రచికిత్సలు నిర్వహించారు. వైఎస్సార్ కంటి వెలుగు ఆవశ్యకతను వివరిస్తూ అన్ని పీహెచ్‌సీల పరిధిలో నేత్ర వైద్య నిపుణులు, వైద్యారోగ్య సిబ్బంది అవగాహన ర్యాలీలు నిర్వహిస్తూ ప్రజలను చైతన్యవంతం చేస్తున్నారు. కంటి శుక్లాల లోపం వల్ల కొద్దికొద్దిగా చూపు మసక బారిపోతుంది. రోగ లక్షణాలు గుర్తించి చికిత్స చేయించుకునే లోపే పరిస్థితి మరింత జటిలంగా మారుతుంది. చూపు కొద్దిగా మందగించినా జీవన గమనానికి తీవ్ర విఘాతం మేర్పడుతుంది. బతుకు భారంగా మారి ఇతరుల మీద ఆధారపడవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. దీనికి తోడు భవిష్యత్ అగమ్యగోచరంగా మారుతుంది. కంటి సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వైఎస్సార్ కంటి వెలుగు పథకం వృద్ధులు, చిన్నారులు, విద్యార్థులకు వరంగా మారడంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. 2019 అక్టోబరు రెండున కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించగా మొదటి విడతలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ప్రత్యేక వైద్య బృందాలు శిబిరాలు ఏర్పాటు చేసి విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. కోవిడ్ అనంతరం రెండో విడతగా గ్రామ, వార్డు సచివాలయాల్లో వృద్ధులకు పరీక్షలు చేశారు. కంటి సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించి అవసరమైన వారికి ఐ డ్రాప్స్, మందులు పంపిణీ చేశారు. అవసరమైన వారికి ఉచితంగా కళ్లజోళ్లు అందజేశారు. సమస్య తీవ్రత అధికంగా ఉన్న వారిని గుర్తించి కంటి సంబంధిత శస్త్రచికిత్సలు చేస్తున్నారు. కొత్తపేట నియోజకవర్గంలో 12,643, రాజోలు నియోజకవర్గంలో 13,328, పి.గన్నవరం నియోజవకర్గంలో 12,707 నియోజకవర్గ పరిధిలో ఇప్పటి వరకు 18,400 మందికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్లజోళ్లు పంపిణీ చేసి కాటరాక్ట్ శస్త్రచికిత్సలు చేపట్టారు.

ప్రజలకు చేరువగా కంటి వైద్యసేవలు



వైఎస్సార్ కంటి వెలుగు పథకం కంటి వైద్య సేవలను ప్రజలకు ఎంతో చేరువ చేసింది. శిబిరాలను ప్రజలు బాగా వినియోగించుకుంటున్నారు. ఆస్పత్రులకు వెళ్లలేని, చికిత్స చేయించుకోలేని అనేక మందికి ఈ పథకం వరంలా ఉంది. అవసరమైన వారికి ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ, శస్త్రచికిత్సలు చేస్తున్నారు.

– పి.భవానీశంకర్, వైద్యాధికారి, పెదపళ్ల

పునర్జన్మ లభించింది



వయసు పైబడటంతో కంటి చూపు మందగించింది. చికిత్స చేయించుకునే స్తోమత లేకపోవడంతో అలాగే బాధపడుతున్నాను. అంతలో వైఎస్సార్ కంటి వెలుగు పథకం ఉందని గ్రామ వలంటీర్ల ద్వారా తెలుసుకుని కంటి పరీక్షలు చేయించుకున్నాను. ఉచితంగా కళ్లజోడు, మందులు అందజేశారు. ఇప్పుడు కంటి చూపు ఎంతో మెరుగుపడటంతో పునర్జన్మ లభించినట్లయింది.

– రావూరి వెంకటేశ్వరరావు, సంధిపూడి

జగనన్నతోనే మంచి భవిష్యత్



నందంపూడిలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న పార్టీ నాయకులు



పి.గన్నవరంలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న పార్టీ శ్రేణులు



చెముడులంకలో నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్‌లో అభివృద్ధిని వివరిస్తున్న తమ్మన

అంబాజీపేట: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి రాష్ట్ర ప్రజలకు వివరించే కార్యక్రమమే జగనన్నే మా భవిష్యత్ అని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జిల్లా అధికార ప్రతినిధి పీకే రావు అన్నారు. నందంపూడిలో జేసీఎస్ మండల కన్వీనర్ దొమ్మేటి సత్యమోహన్ ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నాలుగేళ్లలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనను చూసి ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకోవడంతో పాటు మొబైల్ స్టిక్కర్లు అందజేశారు. కార్యక్రమంలో పితాని వీరాస్వామి, గోసంగి సత్యనారాయణ, పెచ్చెట్టి రాంబాబు, నాగాబత్తుల శశి, కుడుపూడి సత్తిబాబ, ముత్తాబత్తుల సత్యనారాయణ, పెచ్చెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు. గంగలకుర్రు అగ్రహారంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి గత ప్రభుత్వపాలన, వైఎస్సార్ సీపీ పాలనను వివరించి స్టిక్కర్లను అతికించారు. సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు, ఎంపీటీసీ విత్తనాల దుర్గాభవాని, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఎం.ఎం.శెట్టి, రాయుడు షణ్ముఖ్, రాయుడు కృష్ణమహేష్ పాల్గొన్నారు.

అయినవిల్లి: నేదునూరు గ్రామంలో జగనన్నే మా భవిష్యత్ కార్యాక్రమం వైఎస్సార్ సీపీ నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల కష్టాలు తెలిసిన మహా మనిషి అన్నారు. సంక్షేమ పథకాలు అర్హత ఉన్న ప్రతి ఇంటికీ అందాలనే ఉద్దేశంతో పనిచేస్తున్నారన్నారు. గృహసారథులు, వలంటీర్లు, అధికారులు, పార్టీ నాయకుల ద్వారా సీఎం సుపరిపాలన అందిస్తున్నారన్నారు.

కొత్తపేట: రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం, నియోజకవర్గంలో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి అమలు చేసిన, చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు వివరిస్తూ సర్పంచ్ రెడ్డి చంటి ఆధ్వర్యంలో 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ గంగాధరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు రమాదేవి ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు నేతల వెంకటలక్ష్మి, దూళి పూరిబాబు, పార్టీ గ్రామ కన్వీనర్ రెడ్డి సుభాష్, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ నామాడి రాజారత్నం, కొత్తపేట హెచ్‌డీసీ సభ్యుడు పల్లి దిలీప్, మండల ఎస్సీ విభాగం సభ్యుడు అజ్జరపు గిరిబాబు పాల్గొన్నారు.

ఆలమూరు: మండల పార్టీ కన్వీనర్ తమ్మన శ్రీనివాసు ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామాల్లో 'జగనన్నే మా భవిష్యత్' జరిగింది. పార్టీ శ్రేణులు, గ్రామ సచివాలయ కన్వీనర్లు, గ్రామ వలంటీర్లు, గృహసారథులంతా సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంపై ప్రజల్లో విశేష ఆదరణ లభిస్తుంది. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తున్న తీరు ప్రజలను ఆలోచింపజేస్తుంది. గత ప్రభుత్వానికి, ప్రస్తుత ఉన్న ప్రభుత్వానికి ఉన్న తేడాను ప్రజలకు క్షుణ్ణంగా వివరించడంతో పాటు ఇంటి యజమానుల అనుమతితో జగనన్న మా భవిష్యత్ స్టిక్కర్‌ను అంటిస్తున్నారు.

పి.గన్నవరం: జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని పి.గన్నవరం మెయిన్ విలేజ్‌లో పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రజలను కలుసుకుని జగనన్న ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. గత చంద్రబాబు పాలనలో జరిగిన దోపిడీని తెలియజేశారు. ఇళ్లకు స్టిక్కర్లు అతికించారు. పార్టీ నాయకులు అడ్డగళ్ల వెంకటసాయిరామ్, నాగాబత్తుల యువరాజు, అడ్డగళ్ల శ్రీను, నూకపెయ్యి రాజేంద్ర కుమార్, ఉలిశెట్టి పండు, ఎ.పుల్లారావు, తానింకి సీత, అడ్డగళ్ల సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట



గోపాలపురంలో రోడ్డు పనులకు శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

రావులపాలెం: ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. రూ.9 కోట్లతో చేపట్టనున్న గోపాలపురం–ముమ్మిడివరప్పాడు మీదుగా గంటి వెళ్లే రహదారి విస్తరణ, పటిష్ట పరిచే పనులకు ఆదివారం గోపాలపురం సెంటర్లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సీఆర్ఎఫ్ నిధుల నుంచి సీఎం జగన్ కొత్తపేట నియోజకవర్గా నికి రూ.9 కోట్లు మంజూరు చేశారన్నారు. గోపాలపురంలో రోడ్డు డబుల్‌లేన్‌గా తీర్చిదిద్దుతామన్నారు. అలాగే నియోజకవర్గంలోని నార్కెడ్‌మిల్లి పాలేనికి వెళ్లే రోడ్డు, రావులపాలెం సీఆర్సీ రోడ్లకు నిధులు మంజూ రు చేశారన్నారు. అంకంపాలెం రోడ్డు, మడికి రోడ్లకు ప్రతిపాదనలు పంపించామన్నారు. వీలైనంత త్వర గా రోడ్లు మంజూరు చేయించి వాటిని నిర్మిస్తామన్నా రు. అలాగే వివిధ కమ్యూనిటీ భవనాలు నిర్మిస్తున్నా మన్నారు. నియోజకవర్గంలో వివిధ సంక్షేమ పథకాల రూపంలో ప్రజల ఖాతాల్లోకి నేరుగా సుమారు రూ.వెయ్యి కోట్లు జమ చేశారన్నారు. కష్టపడి పని చేస్తున్నాం కాబట్టే గడప గడపకూ వెళ్లి వారికి అందించిన సంక్షేమం, జరుగుతున్న అభివృద్ధి పనులను వివరిస్తున్నామన్నారు. జరుగుతున్న మంచిని చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు మాత్రమే విమర్శిస్తున్నారని, ప్రజలను సోమరులుగా చేస్తున్నారని వ్యర్థ ప్రేలాపన లు పేలుతున్నారన్నారు. పేద ప్రజలకు అండగా నిలిచిన ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అని ప్రజలు గమనిస్తున్నారని, అంతిమ నిర్ణేతలు వారే అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కె.శ్రీనివాసరావు, సర్పంచ్ సబ్బితి మోహనరావు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కర్రి వీర్రెడ్డి, చిర్ల రామచంద్రారెడ్డి, సీఆర్సీ అధ్యక్షుడు తాడి నాగమోహన్‌రెడ్డి, ఎంపీడీఓ జి.రాజేంద్రప్రసాద్, కార్యదర్శి ఎస్.సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో అన్నీ మంచి రోజులే..



నేదునూరులో గడపగడపకూ కార్యక్రమంలో ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు

అయినవిల్లి: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్ర ప్రజలకు అన్ని మంచి రోజులేనని స్థానిక ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. ఆదివారం నేదునూరులో స్థానిక ఎమ్మెల్యే చిట్టిబాబు ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గడపగడపకూ తిరిగి గ్రామస్తులకు అందుతున్న ప్రభుత్వ పథకాలను అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలను అందజేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రతిపక్షాలకు మింగుడుపడటం లేదన్నారు. లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. గ్రామంలో రహదారులు నిర్మించాలని, ఇంటి నిర్మాణానికి రుణాలివ్వాలని ఇలా పలు సమస్యలను ఎమ్మెల్యే చిట్టిబాబు దృష్టికి గ్రామస్తులు తీసుకొచ్చారు. కాలనీలో డ్రెయిన్లు నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, అంబాజీపేట ఏఎంసీ చైర్మన్ వేటుకూరి వెంకట్రాజు, సర్పంచ్ గుమ్మడి ప్రసాద్, కామన కృష్ణమూర్తి, జోగి బాబ్జి, యనమదల సాయి కృష్ణ, కాకిలేటి శ్రీనివాస్, వాసంశెట్టి సూరిబాబు, పులిదిండి ప్రభాకర్, చైతన్య పాల్గొన్నారు.

ఉచిత ఆర్థోపెడిక్ వైద్య శిబిరం

కొత్తపేట: స్థానిక సత్యసాయి సేవా మందిరంలో ఆదివారం ఉచిత ఆర్థోపెడిక్ వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం విశ్వనాథ హాస్పిటల్ ఆర్థోపెడిక్ డాక్టర్ సత్యవరపు రఘురామ్ వైద్య సేవలందించారు. ముందుగా బీపీ, బోన్ డెన్సిటీ పరీక్షలు చేశారు. అనంతరం కీళ్లకు సంబంధించి సుమారు 100 మంది పేషంట్లను పరీక్షించి, ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి కన్వీనర్ కంకటాల సత్యనారాయణ మూర్తి, సమితి సభ్యులు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ప్రేమపథమే ఏసుతత్వం

- ఘనంగా ఈస్టర్ వేడుకలు
- పాల్గొన్న ఎమ్మెల్యేలు జగ్గిరెడ్డి, చిట్టిబాబు



ఈస్టర్ ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి



బొబ్బర్లంక చర్చిలో ప్రసంగిస్తున్న దైవానంద్

రావులపాలెం/అయినవిల్లిలమూరు/పి.గన్నవరం త్రేయపురం/అంబాజీపేట/సఖినేటిపల్లి: ప్రేమపథమే ఏసుతత్వమని తోటి వారందరినీ ప్రేమించాలని, కక్షలు, కార్పణ్యాలకు అందరూ దూరంగా ఉండాలని ఏసుక్రీస్తు ప్రపంచానికి చాటి చెప్పారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఈస్టర్ సందర్భంగా ఆదివారం రావులపాలెం మండలం పొడగట్లపల్లి వినాయకపాలెం రోడ్డులోని సియోను ప్రార్థనా మందిరంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. అనంతరం జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రార్థనా మందిరాని కర్తున్న కరెంటు సమస్యను సంఘ సభ్యులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అతి త్వరలోనే సమస్యకు పరిష్కారం చూపుతామని జగ్గిరెడ్డి వారికి హామీ ఇచ్చారు. అయినవిల్లి మండలంలోని నేదునూరులో ఈస్టర్ పర్వదినాన్ని ఆదివారం బేతని జేడీయం చర్చ్ ఆధ్వర్యంలో ఘనంగా జరిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ప్రజలకు ఈస్టర్ శుభాకాంక్షలు తెలిపారు. చిట్టిబాబు మాట్లాడుతూ క్రీస్తు ప్రవచనాలు అనుసరణీయమైనవని అన్నారు. ఆయన ప్రజలకు సన్మార్గాన్ని సూచించారన్నారు. ఆలమూరు మండలంలోని వివిధ గ్రామాల్లోని క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో ఆదివారం ఈస్టర్ వేడుకలు జరుపుకొన్నారు. ఆలమూరులోని కాలిబాట వంతెన సమీపాన ఏటిగట్టు పక్కన ఉన్న తమ పి.గన్నవరం మండలంలోని నాగుల్లంక శివారు పెదకందాలపాలెం న్యూజెరూషలెం చర్చిలో రెవరెండ్ జి.దానియేలు ఆధ్వర్యంలో ఆదివారం ఈస్టర్‌ను ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచ మానవాళి పాపపరిహారార్థం ఏసు క్రీస్తు శిలువపై చనిపోయి, మూడో తిరిగి లేచారని వివరించారు. వృద్ధులకు వస్త్రదానం చేశారు. ఎస్‌జీఎం కార్యదర్శి యు.జాన్‌బాబు, జె.కరుణకుమార్, లాజరస్ జోసఫ్, అధిక సంఖ్యలో క్రైస్తవ విశ్వాసులు పాల్గొన్నారు. ఆత్రేయపురం మండలంలోని ప్రతి గ్రామంలో క్రైస్తవులంతా భక్తిశ్రద్ధలతో ఈస్టర్ జరుపుకొన్నారు. పాస్టర్లు ఫ్రాన్సిస్ దైవానంద్ మాట్లాడుతూ పూర్వం ఎప్పుడో చేసిన పాపాలకు ఆ క్షణానే శిక్షలు ఉండేవని కాని క్రీస్తు జననం వల్ల శిక్షలు లేక క్షమాపణ మాత్రమే మిగిలి ఉందన్నారు. ప్రతి మనిషి తప్పు చేయడం సహజమని వాటిని నిర్భయంగా ఏసు ప్రభు ముందు ఒప్పుకోవడం వల్ల వారి పాపములు తొలగి పోతాయన్నారు. ర్యాలి గ్రామంలో క్రీస్తు సంఘం నిర్వాహకులు పీఎస్ రెడ్డి జయపాల్ ఆధ్వర్యంలో స్థానిక చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అంబాజీపేట మండలంలోని అన్ని క్రైస్తవ చర్చిల్లో జాగరణ ప్రార్థనలు నిర్వహించారు. అంబాజీపేట మండల యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ఈస్టర్ వేడుకలు నిర్వహించారు. పలువురు చర్చి ఫాదర్‌లు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రీస్తు బోధనలను అనుసరించి సన్మార్గంలో నడవాలని కోరారు. సఖినేటిపల్లి మండలంలోని వివిధ చర్చిల్లో ఆదివారం ఈస్టర్ పండుగను క్రైస్తవులంతా భక్తిపారవశ్యంతో జరుపుకున్నారు.

చిన్నారికి చేయూత



చిన్నారికి నగదు సాయాన్ని అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: కిడ్నీ, రక్తం ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్న చిన్నారికి స్థానిక కాశీఅన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు రూ.11 వేల ఆర్థిక సాయం అందజేశారు. మండలంలోని రావులపాడు గ్రామానికి చెందిన శ్రీనిధి అనే చిన్నారికి గత కొంతకాలంగా కిడ్నీ, రక్తంలో ఇన్ఫెక్షన్‌తో బాధపడుతుంది. ప్రతి నెలా ఈ పాపకి రక్తం ఎక్కించాల్సి వస్తుంది. పేదరికంలో ఉన్న పాప తల్లిదండ్రులు వైద్యం చేయించడానికి పడుతున్న ఇబ్బందులు తెలుసుకున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులు ఆదివారం వారికి రూ.11 వేలు నగదు సాయాన్ని వైద్యం కోసం అందజేసినట్టు సభ్యులు తెలిపారు. ఈ పాప ఇంటి వద్ద తల్లిదండ్రులకు నగదు అందించామన్నారు.

మలికిపురం ఎస్సైగా సురేంద్ర



సురేంద్ర

మలికిపురం: మండలంలోని శాంతి భద్రతలే ప్రధానంగా పని చేస్తానని మలికిపురం నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన జి.సురేంద్ర పేర్కొన్నారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రధానంగా నేడు గ్రామాల్లో గంజాయి సరఫరా జరుగుతున్నట్లు పలు కేసులు నమోదవుతున్నాయన్నారు. దాని నివారణపై ప్రధానంగా దృష్టి పెడతామన్నారు. అలాగే యువత తప్పుడు మార్గాల వైపు వెళ్లకుండా నివారిస్తామన్నారు. మండలంలో ప్రజలు అన్ని విధాలుగా సహకారాలు అందించి ఆరోగ్యకర సమాజ నిర్మాణం కోసం ముందుకు సాగుదామన్నారు.

మత్స్యకార కుటుంబాల ఆందోళన

మామిడికుదురు: రైల్వే లైన్ నిర్మాణం కోసం తీసుకున్న భూమిలో ఉన్న ఇళ్లను తొలగించి ఇళ్ల స్థానంలో ఉన్న మట్టిని చెరువు తరహాలో తవ్వేస్తున్నారంటూ పాశర్లపూడిబాడవ పల్లపపాలెం మత్స్యకారులు ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. రైల్వేలైన్ నిర్మాణం కోసం తీసుకున్న 35 ఇళ్లకు రైల్వే అధికారులు పరిహారం చెల్లించారన్నారు. భూమితో సమానంగా తీయాల్సిన మట్టిని అలా కాకుండా ఎనిమిది అడుగుల లోతు పైబడి తీయడం వల్ల అక్కడ చెరువు మాదిరిగా మారి ప్రమాదకర పరిస్థితులు ఏర్పడుతున్నాయని చుట్టు పక్కన నివాసం ఉంటున్న మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇళ్లు తొలగించిన తర్వాత భూమికి సమాంతరంగా తవ్వాల్సిన మట్టిని చెరువు మాదిరిగా తవ్వేయడం వల్ల వర్షాలకు గోతులు నిండి ప్రమాదవశాత్తూ పిల్లలు ఆ గోతుల్లో పడి మృత్యువాత పడే ప్రమాదం ఉందన్నారు. దీనిపై తక్షణం రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు స్పందించి తీసిన గోతులను పూడ్చాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎంపీటీసీ అంకాని వీరాంజనేయులు, మల్లాడి విష్ణు, మల్లాడి సత్యనారాయణ, చింతా కనకం పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

కొత్తపేట: చెప్పిన మాట, ఇచ్చిన హామీలను ఏటా 'సంక్షేమ క్యాలెండర్' ప్రకారం అమలు చేస్తున్న ఘనత ఈ దేశంలో ఏపీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు రమాదేవి అన్నారు. మండలంలోని అవిడి రజకులపేటలో మండల పరిషత్ నిధులు రూ.6 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు నిర్మాణానికి ఆదివారం ఎంపీపీ మార్గన గంగాధరరావు శంకుస్థాపన చేశారు. జెడ్పీటీసీ రమాదేవి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల ఆర్థిక అవసరాలు తీరేలా వారి సంక్షేమం, మరోపక్క రోడ్లు, డ్రైన్లు, వివిధ ప్రాజెక్టుల నిర్మాణంతో రాష్ట్రాభివృద్ధి రెండు కళ్లుగా ప్రభుత్వం పాలన సాగిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ, అభివృద్ధి పథకాలు దేశ వ్యాప్తంగా ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయన్నారు. సచివాలయ వ్యవస్థ, కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుతో ప్రభుత్వాన్ని, అధికార యంత్రాంగాన్ని ప్రజలకు అందుబాటులోకి తెచ్చి రాష్ట్ర స్వరూపాన్నే మార్చారని అన్నారు.

ఆదర్శ రైతులకు సన్మానం

మామిడికుదురు: ఈదరాడలో ప్రకృతి వ్యవసాయం, చిరు ధాన్యాల వినియోగం, సేంద్రియ వ్యవసాయం ప్రాధాన్యంపై ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. బీజేపీ 43వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మండల బీజేపీ కిసాన్ మోర్చా అధ్యక్షుడు ఆకుల దొరబాబు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. అనంతరం ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులను సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు మెండా ఆదినారాయణ, కంకిపాటి సుబ్బారావు, వేగి వెంకటేశ్వరరావు, పి.మహాలక్ష్మిరావు, కె.తమ్మయ్యనాయుడు, కె.గంగాధరం, పి.సత్తిబాబు, నక్కా త్రిలోచనరావు, బండారు పళ్లంరాజు, పాలూరి రాంబాబు, యేడిద బాబులు పాల్గొన్నారు.

రేపు ఉచిత కంటి శిబిరం

పి.గన్నవరం: ముంగండలోని మంత్రవాది ఇందిరా కుమారి స్మారక గ్రామీణ వైద్యాలయంలో మంగళవారం ఉదయం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు హోమియో వైద్య భిజి ఖండవిల్లి నాగేశ్వరరావు తెలిపారు. వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆస్పత్రి వైద్యులు కంటి పరీక్షలు చేస్తారని ఆయన వివరించారు. మందులు ఉచితంగా అందజేస్తామన్నారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తారని ఆయన వివరించారు. ఈ కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.